సాక్షి ములుగు

శనివారం । 7 । జనవరి । 2023



పనికి తగిన వేతనం ఇవ్వాలి

యూనివర్సిటీల్లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో▸



మూఢనమ్మకాలను నిరోధించాలి

- 8లో▸

ప్రసార మాధ్యమాల్లో మూఢ నమ్మకాలను నిరోధించాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ అన్నారు.

గరిష్టం/కనిష్టం
$29.1^0/17.2^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం



ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం మైనార్టీ గురుకుల పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ అతియా సుల్తానా అన్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదో తరగతిలో మైనార్టీలకు 60 సీట్లు, బీసీలకు 10 సీట్లు, ఎస్సీలకు 05 సీట్లు, ఎస్టీలకు 03 సీట్లు, ఓబీసీలకు 02 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. దీంతో పాటు 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉన్న ఖాళీలకు మైనార్టీలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 7995057915 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సెలవుదినంగా ప్రకటించాలి



ములుగు: వచ్చేనెల 15వ తేదీన జరుగనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న గిరిజన లంబాడ ఉద్యోగులకు సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కృష్ణ ఆదిత్యను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాహుల్‌నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతికి ప్రతి జిల్లాకు రూ. 10 లక్షలు కేటాయించాలని కోరారు. ఈ విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ గ్రామాల అభివృద్ధే లక్ష్యం



భూపాలపల్లి అర్బన్: మండలంలోని అటవీ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.4కోట్లతో పంబాపూర్ గ్రామ సమీపంలోని సుద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. గ్రామంలో రూ.20లక్షల నిధులతో అంతర్గత రోడ్డు నిర్మాణం, దీక్షకుంట గ్రామంలో రూ.42లక్షలతో దీక్షకుంట నుంచి పంబాపూర్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లావణ్య సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, సర్పంచ్ రమేష్, నాయకులు రఘుపతిరావు, శ్యామ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

చిట్యాల: బీసీలు రాజకీయంగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో 60శాతం ఉన్న బీసీలను అన్ని పార్టీలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించినా ఇంతవరకు బీసీ ముఖ్యమంత్రిగా ఒక్కరు కూడా పదవి చేపట్టలేదన్నారు. బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయని అన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా బీసీలంతా ఏకమై పార్టీలకతీతంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో గోల్కొండ కోటపై బీసీ జెండాను ఎగర వేయడమే లక్ష్యంగా బీసీ సంక్షేమ సంఘం కృషి చేస్తుందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు బీసీ సంక్షేమ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్, నాయకులు పంజాల మధు గౌడ్, వడ్లకొండ పవన్ పాల్గొన్నారు.

తారు లేసినట్లుగా కనిపిస్తున్న బీటీ రోడ్డు



ఇష్టారాజ్యం!

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం

- కొరవడిన ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారీతిలో పనులు చేస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు మినీ సమ్మక్క సారలమ్మ జాతర జరుగనుంది. ఈ జాతరకు సుమారుగా 4 నుంచి 5 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇప్పటికే అధికారులతో పలుమార్లు సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్యాచ్ సంబంధిత పనులు కాంట్రాక్టర్లే దగ్గరుండి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన పనులు చేయిస్తున్నారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో 'సాక్షి' పనులను పరిశీలించగా అధికారులు ఏ పని వద్ద కూడా కానరాలేదు.

పైపైనే ప్యాచ్ వర్క్‌లు..

నార్లాపూర్ నుంచి ప్రాజెక్ట్‌నగర్ మధ్యలో అక్కడక్కడ దెబ్బతిన్న రోడ్లను బీటీతో ప్యాచ్ వర్క్‌లను చేస్తున్నారు. గత ఏడాది మహాజాతరలోనే నార్లాపూర్ నుంచి పస్రా వరకు కొత్త బీటీ రోడ్డు నిర్మించారు. ఇటీవల ఇసుక లారీ తాకిడికి అక్కడక్కడ రోడ్డు ధ్వంసమైంది. మినీ జాతరకు వచ్చే భక్తుల రవాణా సౌకర్యార్థం రోడ్డు దెబ్బతిన్న చోట గతేడాది బీటీ రోడ్డు వేసిన సంబంధిత కాంట్రాక్టరే ప్యాచ్ వర్కు పనులు చేస్తున్నాయి. అయితే పనులు మాత్రం పైపైనే చేస్తున్నట్లు కనిపిస్తుంది. నార్లాపూర్ బ్రిడ్జి వద్ద సుమారు 50 మీటర్ల బీటీ రోడ్డు వేశారు. కాని ఎక్కడా కూడా పటిష్టంగా వేయకపోవడంతో రోడ్డు మొత్తం తేలినట్టుకనిపిస్తుంది. ఇప్పుడే ఇలా ఉంటే జాతర సమయానికి భక్తులకు ఈ రోడ్డు సౌకర్యవంతంగా ఉంటాయా లేదా అనే ప్రశ్న తలెత్తుతుంది.



నామమాత్రంగా కల్వర్టు పనులు..



మేడారంలోని శివరాంసాగర్ - ఆర్టీసీ బస్టాండ్ మధ్యలో సైడ్‌లైన్ కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ కల్వర్టు రోడ్డుపై పైపులు అమర్చి సెంట్రింగ్ వేసి సిమెంట్ కంకర పోస్తున్నారు. కాంక్రిట్ పటిష్టంగా ఉండేందుకు వైబ్రేటర్ మిషన్‌తో కుదించాల్సి ఉండగా కాంట్రాక్టర్ మాత్రం చిన్న కర్రతో కాంక్రిట్ కుదిస్తున్నారు. కాంక్రిట్ పనుల సమయంలో నాణ్యత ప్రమాణాలు పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపిస్తుంది.

డేంజర్.. యమ డేంజర్..



నార్లాపూర్ చింతల్ నుంచి ఎల్బాక మీదుగా మేడారానికి వెళ్లే దారిలో ఎల్బాక ఊరి సమీపంలో సీసీ రోడ్డు మధ్యలో భారీ గోతులు ఏర్పడ్డాయి. వాహనదారుల సూచికగా ఈ భారీ గోతుల్లో కర్ర పెట్టారు. సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు నార్లాపూర్ చింతల్ నుంచి ఎల్బాక మీదుగా మేడారానికి వెళ్తుంటారు. రాత్రి 6 దాటిందంటే చిమ్మచీకటితో ఈ రోడ్డుపై ఉన్న గుంతలు, కర్రలు ఎవరికీ సరిగ్గా కనబడవు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్న భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు త్వరగా చర్యలు తీసుకొని ఇలాంటి ప్రదేశాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



రెవెన్యూ సదస్సుకు హాజరైన అదనపు కలెక్టర్

వెంకటాపురం(కె): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వై వి గణేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాచపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రైతులకు నెలకొన్న భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉప్పేడు, వీరపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల తహసీల్దార్ అంటి నాగరాజు తదితరులు ఉన్నారు.

భూ సమస్యలపై అవగాహన

వాజేడు: భూమికి సబంధించిన సమస్యలపై జిల్లా అడిషనల్ కలెక్టర్ వైవీ గణేష్ రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని మొరుమూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. భూమికి సబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీ సేవలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ గూడూరు లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఆర్ఐ కాట రాజు ఉన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న జిల్లా అధికారులు



హేమాచల క్షేత్రంలో డీపీఓ వెంకయ్య తదితరులు

మంగపేట: రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధి గాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామిని జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్య శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు జిల్లా సహకార అధికారి(డీసీఓ) సర్దార్‌సింగ్, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ఏటూరునాగారం ఐటీడీఏ పీసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేఖర్ శర్మ గోత్ర నామాలతో స్వామివారికి అర్చన జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందచేశారు.

ఫారెస్టు అధికారులను చితకబాదిన మావోయిస్టులు

కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పరిధి కమలాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్డు సర్వే కోసం వెళ్లిన ఫారెస్టు అధికారులను మావోయిస్టులు చితకబాదారు. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సిరొంచ అటవీశాఖ అధికారి పూనమ్‌పేట్ తెలిపిన వివరాల ప్రకారం... కమలాపూర్ అటవీ ప్రాంతంనుంచి కోరేపల్లి వెళ్లే రహదారిపై సర్వే చేసేందుకు గురువారం వెళ్లారు. పని ముగించుకొని సాయంత్రం తిరిగి వస్తుండగా అటవీశాఖ అధికారి వికాస్‌బోయర్‌తోపాటు ఫీల్డ్ అసిస్టెంట్, మరో 20మంది సిబ్బందిపై నైనర్–కపవంచ రహదారి వద్ద మావోయిస్టులు అడ్డుకుని చితకబాదారు. ఫారెస్టు ఉద్యోగుల సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు తీసుకెళ్లారు. 5 ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేసినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, డిసెంబర్ 23న ఛత్తీస్‌గఢ్‌లోని సీ–60బలగాలు ఇద్దరు మావోయిస్టులను కాల్చి చంపిన విషయం తెలిసిందే. అప్పటినుంచి మావోయిస్టులు జిల్లావ్యాప్తంగా చైతన్యమయ్యారని, అక్కడక్కడా బ్యానర్లు వేయడం, వాహనాలను తగులబెట్టడం వంటి ఘటనలు జరగడంతో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. దీంతో ఫారెస్టు ఉద్యోగుల్లో భయాందోళన మొదలైంది. ఈ ఘటన గోదావరి తీర ప్రాంత వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఇళ్ల స్థలాలు ఇప్పించాలి



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న బాధితులు

ఏటూరునాగారం: మాకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ముంపు బాధితులు శుక్రవారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గోదావరి వరద ముంపు బాధితులంతా కలిసి గ్రామ సమీపంలోని కోడిపుంజుల అంగడి వద్ద తాత్కాలికంగా గుడిసెలను వేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వాటిని తొలగించి కర్రలను అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి ట్రాక్టర్‌లో తరలించారు. ఈ విషయమై ప్రజలు, అధికారులకు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ముంపు బాధితులు రాధిక, లలిత, బోట రమణయ్యలు మాట్లాడుతూ గోదావరి వరదలు వస్తే తమ ఇళ్లు నీటిలోనే రోజుల కొద్ది ఉంటుందన్నారు. ఆ నీటిలోనే చావు బతుకుల మధ్య పోరాడుతూ గడపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామం చుట్టూ కరకట్ట ఉన్నప్పటికీ నీటి వరద ఇళ్లలోకి చేరి ధాన్యం, బట్టలు అన్ని కోల్పోయామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదరి తిరుపతి, శంకర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ టీచర్లకు పదోన్నతి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్ టీడబ్ల్యూటీయూ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జబ్బ రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవన్నారు. సాధారణ బదిలీలను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల జీపీఎఫ్, సరేండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కిరణ్, మల్లయ్య, సారంగపాణి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏటూరునాగారం: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాడుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ. దావూద్ అన్నారు. సీఐటీయూ అల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న 72 రకాల స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సంజీవకు అందజేశారు. అనంతరం దావూద్ మాట్లాడుతూ స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, గ్రాట్యుటీ ఇతర స్కీంలు వర్తింప చేయాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో వివిధ రకాల స్కీం వర్కర్లకు ఒకే సర్వీస్ రూల్స్ ఉండాలన్నారు. 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొగ్గుల సరిత, మాధవి, స్వరూప, లావణ్య, కాళిక, అరుణ, శారద, రాణి, సాంబలక్ష్మి, సునీత, వినోద, సునీత పాల్గొన్నారు.

రెండు మోటార్లతో ఎత్తిపోత

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో మూడో రోజు వరుస క్రమంలోని 2వ, 3వ మోటార్లతో నీటిని డెలివరీ సిస్టర్న్‌లో ఇంజనీరింగ్ అధికారులు ఎత్తిపోస్తున్నారు. రెండు మోటార్లతో 4,400 క్యూసెక్కులు గ్రావిటీ కాల్వ ద్వారా అన్నారంలోని సరస్వతీ బ్యారేజీకి తరలిపోతున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని సరస్వతీ పంపుహౌస్‌లో రెండు మోటార్లతో 6వేల క్యూసెక్కులు, పార్వతీ పంపుహౌస్‌లో రెండు మోటార్లతో 5,400క్యూసెక్కులు తరలి ఎగువ బ్యారేజీల్లోకి చేరుతున్నాయి. రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు మోటార్లను నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న ఎంపీ బాబురావు

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లాలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని ఎంపీ సోయం బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని మేడారంలోని వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చిన ఎంపీ బాబురావును ఆలయ సంప్రదాయంగా పూజారులు డోలివాయిద్యాలతో అమ్మవార్ల గద్దెలపై స్వాగతం పలికారు. సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్ద ఎంపీ సోయం బాబురావు, పార్టీ నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆయనను పూజారులు అమ్మవార్ల శేషవస్త్రం కండువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతుందన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, జిల్లా కన్వీనర్ బాలరాం, మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి నరేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హన్మంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సిద్దబోయిన పాపరావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఇప్ప ప్రకాష్, నాయకులు ఆళ్ల కుంట చిన్న, బూత్ అధ్యక్షుడు వల్లెపు కిరణ్, లక్ష్మణ్, శ్రీకాంత్, వెంకటేష్, వెంకట్రాం నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఎంపీ

మంగపేట: హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ఎంపీ, ములుగు జిల్లా బీజేపీ పాలక్‌గా నియమించిన సోయం బాబూరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేఖర్‌శర్మ గోత్ర నామాలతో స్వామివారికి అర్చన జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన ఎంపీ బాబూరావు, బీజేపీ పార్టీ ప్రముఖ నాయకులకు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఆలయ ట్రస్టీ, నాగులమ్మ ఉపాసకుడు(ప్రధాన పూజారి) బాడిష రామకృష్ణ స్వామి గిరిజన సాంప్రదాయ బద్దంగా డోలి వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికి ఆలయానికి ఆహ్వానించారు.

జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

భూపాలపల్లి అర్బన్: జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీమ్‌ల పేర్లు ఈ నెల 13వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.20వేల నగదు ఉంటుందని తెలిపారు. వివరాలకు 84990 99070, 91544 08087 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఓట్ల కోసమే పథకాలు

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్

ఏటూరునాగారం: ప్రభుత్వాలు పెడుతున్న పథకాలన్నీ ఓట్ల కోసమేనని దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆరోపించారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం, రాంనగర్ గ్రామాల్లో పాదయాత్ర కొనసాగింది. స్వరాజ్య పాదయాత్ర సందర్భంగా డీఎస్పీ జెండా దిమ్మెలను ఆవిష్కరించి మాట్లాడారు. ఇప్పుడున్న ప్రభుత్వాలే కాదు గత రెండువేల సంవత్సరాలుగా అగ్రకులాలే ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలిస్తున్నారని, తొంభై శాతం పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను బానిసలుగా మార్చారన్నారు. అగ్రకులాల వల్ల పరాజితులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలను విజేతలుగా మార్చడానికే పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేస్తున్నట్లుగా ప్రకటించారు. తెలంగాణలో ఐదు, పది శాతం లేని కొంతమంది భూమిని సంపదని అధికారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని సబ్బండ కులాల ప్రజలను ఓట్లు వేసే మూడిసరుకులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, రమేష్, జిల్లా నాయకులు చరణ్, సాగర్, కరుణాకర్, యుగంధర్, గణపతి తరుణ్ రాజు, శేఖర్, కిషోర్ పాల్గొన్నారు.

మాజీ నక్సలైట్ అరెస్ట్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

ములుగు: మావోయిస్టు పార్టీలో చేరాలని ప్రేరేపితం చేస్తున్న మాజీ నక్సలైట్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఏఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ మీడియా ఎదుట ఇద్దరిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మాజీ నక్సలైట్ బొట్ల అశోక్ చెప్పిన మాటలకు ప్రేరేపితమై ములుగు మండలం మల్లంపల్లికి చెందిన బాలుగు గణేశ్, జాకారం గ్రామానికి చెందిన పుల్యాల నవీన్ మావోయిస్టు దళంలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నారనే సమాచారం అందుకున్న పోలీసులు ఓఎస్డీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో అశోక్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ములుగు ఎస్సై ఓంకార్‌యాదవ్ ఆధ్వర్యంలో టీంను ఏర్పాటు చేయగా గణేశ్, నవీన్ నుంచి విప్లవ సాహిత్యాలు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అశోక్ మీద గతంలో క్రిమినల్ కేసు నమోదై ఉందని ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ మేకల రంజిత్ కుమార్, ఎస్సైలు బొంకూరి ఓంకార్‌దవ్, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున

జనగామ: జనగామ జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యత, సంప్రదాయ వస్త్ర ప్రపంచానికి పెట్టింది పేరుగా నిలిచిన రామ్‌రాజ్ షోరూం జనగామలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ రామ్‌రాజ్ కాటన్ నిపుణుల పర్యవేక్షణలో మృదువైన వస్త్రాలు అన్ని రంగుల్లో తయారు చేస్తున్నామని.. మహిళలు, పురుషులు, చిన్నారులకు కావాల్సిన దుస్తులు మా షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ ఫౌండర్, చైర్మన్ కేఆర్ నాగరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాంకుడోతు అనిత, బండ పద్మ, ప్రముఖులు నగేష్, పజ్జూరి జయహరి, బండ యాదగిరిరెడ్డి, మాశెట్టి వెంకన్న, బచ్చు రమేష్, బచ్చు పవన్, పజ్జూరి జయహరి, యాంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

- నిందితుడిపై పోక్సో కేసు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన పులి రజనీకుమార్ అనే యువకుడు సమీప గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాలకు చెందిన రజనీకుమార్ సమీప గ్రామంలోని అతడి అక్క(పెద్దమ్మబిడ్డ) ఇంటికి ఈనెల 1న చుట్టపుచూపుగా వెళ్లాడు. ఈనెల 2న ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కుమార్తె వరుసకు కోడలైన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేయగా బాలిక గట్టిగా అరవడంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. కాగా, నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దోర్నకల్ రైల్వేస్టేషన్ ఆవరణలో సేదతీరుతున్న కూలీలు



మహారాష్ట్ర టు మానుకోట

మహారాష్ట్ర కూలీలు మహబూబాబాద్ జిల్లాకు తరలివస్తున్నారు. మానుకోటతో పాటు దోర్నకల్‌లో రైళ్లు దిగి.. మిర్చి తోటల్లో పనులకు గ్రామాలకు వెళ్తున్నారు. కాగా మహారాష్ట్ర నుంచి కుటుంబసమేతంగా జిల్లాకు చేరుకొని రెండు మూడు నెలలపాటు మిర్చి తోటలోనే గుడారాలు వేసుకొని కోతలు ముగిసిన అనంతరం తిరిగి స్వస్థలాలకు వెళ్తారు.

-దోర్నకల్/సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్





మహబూబాబాద్ జిల్లా కేంద్రంగుండా శుక్రవారం వాహనాలలో కిక్కిరిసి వెళ్తున్న కూలీలు

నలుగురు వాహనదారులపై చీటింగ్ కేసు

కాజీపేట: కాజీపేటలోని ఫాతిమా జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై రాజేష్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మహేందర్, చెవ్వ సాంబరాజు, గబ్బెట కిరణ్, మునిగంటి రవికుమార్‌లు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఎస్సై ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిపై..

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తూ శారీరకంగా వాడుకుంటున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం తండాకు చెందిన వాంకుడోత్ చంద్ర మడికొండ సమీపంలోని ఓ దాబా టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. దాబా సమీపంలో ఉండే యువతితో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. తరచూ ఫోన్ చేయడం, మెసేజ్‌లు పంపించడం గుర్తించిన యువతి తల్లిదండ్రులు తమ కూతురుని తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయారు. అక్కడికి సైతం వెళ్లిన చంద్ర గదికి రాకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో యువతి తల్లిదండ్రులు కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి వివరించారు.

ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కేయూ జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పూణేలోని సావిత్రిబాయి పూలే యూనివర్సిటీలో ఈ నెల 9 వరకు నిర్వహించబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న శుక్రవారం తెలిపారు. జట్టులో సుమయ్యత బుస్సం, జె.మాధురి (వరంగల్ కిట్స్ కళాశాల), మనీషా(యూనివర్సిటీ కాలేజీ), ఎస్.పరమేశ్వరి, ఎ.అఖిల, ఎన్.సుస్మిత (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఉమెన్ వరంగల్ వెస్ట్), కె.అంజలి, పి.వందన, జి.ప్రవళిక(టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మంచిర్యాల) ఉన్నారు. వీరికి మేనేజర్‌గా అసిఫాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ(ఉమెన్) ఫిజికల్ డైరెక్టర్ బి.హారిక వ్యవహరిస్తారు.

మృత్యువుతో పోరాడి జూనియర్ లైన్‌మన్ మృతి

కాజీపేట: స్తంభంపై నుంచి జారిపడిన జూనియర్ లైన్‌మన్ ఆవునూరి మధు(29) మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాజీపేట నిట్ ప్రాంతంలో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో మధు జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని బుధవారం ఫోన్ రావడంతో స్తంభం ఎక్కి జారి కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మధును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు.



మధు (ఫైల్)

విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలి

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: ప్రైవేట్ డెయిరీల పాలలో వైట్‌నర్, యూరియా వంటి రసాయనాలు కలుస్తున్నాయని, మనమంతా స్వచ్ఛమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులనే వాడుదామని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని విజయ డెయిరీ వరంగల్ యూనిట్ ఆవరణలో శుక్రవారం జరిగిన పాడిరైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నగరంలో విజయ పాల ఉత్పత్తులను అమ్మేందుకు నిరుద్యోగ యువతతో స్టాళ్లు ఏర్పాటు చేయిస్తానని, ట్రై సైకిళ్లు అందజేసి ప్రధాన కూడళ్లలో అమ్మకాలు జరిగేలా చూస్తామని అన్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో త్వరలో కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు, విజయ డెయిరీ డీడీ ప్రదీప్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ, వరంగల్ జిల్లా అధకారి బాలకృష్ణ, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రఘుబాబు, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

- వర్సిటీలకు నిధులు రెట్టింపు చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు. యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ సరిపోవడం లేదని, బ్లాక్ గ్రాంట్‌ను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో అనేక లోపాలున్నాయని, దానికి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ యూనివర్సిటీల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సభలో ఏపీ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఎంప్లాయీస్ వర్కర్స్ అండ్ టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటేష్, ఆల్ ఇండియా యూనివర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎ.రామచందర్, జనరల్ సెక్రటరీ పెండ్యాల రవి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిరోధించాలి



మాట్లాడుతున్న నర్సింహ

మడికొండ: ప్రసార మాధ్యమాలలో మూఢ నమ్మకాలను నిరోధించాల్సిన అవసరముందని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ అన్నారు. కాజీపేట మండలం మడికొండ శివారు రాజన్నబండ వద్ద నిర్వహిస్తున్న ప్రజానాట్య మండలి జిల్లా శిక్షణ తరగతుల్లో శుక్రవారం రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రచార మాధ్యమాలలో ద్వారా మూఢ నమ్మకాలు విస్తరిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించకపోవడం శోచనీయం అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మినీ రవీంద్ర భారతి నిర్మించాలని, అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకుడు రాజమౌళి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టెపాక రవి, అధ్యక్షుడు గడ్డం రాజనర్సు, మాలోత్ శంకర్, రాసమల్ల దీన, స్వరూప, రాజమణి, రమేష్, మమత, మాధురి, శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడేమోనని..

- పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విష్ణు

కేసముద్రం: స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడనే భయంతో విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ్యాతండా శివారు గుడితండాలో శుక్రవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గుడితండాకు చెందిన ధరంసోత్ విష్ణు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. అప్పటికే ఊరికి వెళ్లిన అతడి తండ్రి రాము తిరిగి ఇంటికి వచ్చాక మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి విష్ణు ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు, తండావాసులు మానుకోటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విష్ణు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

తలసేమియా బాధితులకు అండగా..

- యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం రేపు మెగా రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తూ.. (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : తలసేమియా జన్యు సంబంధమైన వ్యాధి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఏ వయస్సు వారికైనా వ్యాధి రావొచ్చు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి 15రోజులకోసారి రక్తం మార్పిడి చేయాలి. లేదంటే వారు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 200 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారికోసం యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేకరించిన రక్తాన్ని హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా అందిస్తున్నారు.

2016 నుంచి..

అత్యవసర సమయాలు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే ఉద్దేశంతో 2016లో వరంగల్‌కు చెందిన స్విమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్‌కుమార్ కలిసి వరంగల్‌లో యువ నేతాజీ ఫౌండేషన్ నెలకొల్పారు. ఇప్పటి వరకు 31రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి దాతల సహకారంతో 5,071 మందికి ఉచితంగా రక్తం అందించారు. కరోనా సమయంలో ఫౌండేషన్ ద్వారా ప్లాస్మాదానంపై అవగాహన కల్పించి 235 మందితో ప్లాస్మాదానం చేయించారు. కోవిడ్ సమయంలో కేవలం తలసేమియా చిన్నారుల కోసం 22 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 1,254 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించారు.

రేపు శిబిరం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం(రేపు) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. వివరాలకు 94901 15105, 96661 09108 నంబర్లలో సంప్రదించాలని సిమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్ కుమార్ కోరారు.

యువతలో అవగాహన కల్పించాలన్నదే ధ్యేయం...



యువతకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇప్పటి వరకు 30సార్లు రక్తదానం చేశాను. శిబిరంలో సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి సేకరించిన రోజు నుండి 5రోజుల్లో తలసేమియా బాధితులకు ఉపయోగించాలి. లేదంటే వారికి ఉపయోగపడదు. మేము అత్యవసరమైన వారికి రక్తం అందిస్తాం. మాతో పాటు యువతలో అవగాహన కల్పించాలన్నదే మా ధ్యేయం.

- సిమ్మర్ రాజు

తలసేమియా బాధితుల కోసం..



తలసేమియా బాధితులకు ఉయోగపడాలని నేను 28 సార్లు రక్తదానం చేశాను. దీంతో అత్యవసరమైన వారి ప్రాణాలు కాపాడినవారం అవుతాం. ఆదివారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి.

- కొత్తకొండ అరుణ్ కుమార్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వరంగల్



ట్రోఫీ అందుకుంటున్న వరంగల్ జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు

కాశిబుగ్గ: రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్స్‌లో వరంగల్ – హైదరాబాద్ జట్లు తలపడగా 11–10 గోల్స్ తేడాతో వరంగల్ జట్టు ఘన విజయం సాధించి చాంపియన్‌గా నిలవగా హైదరాబాద్ బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే, మూడోస్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం–మహబూబ్‌నగర్ జట్ల నడుమ మ్యాచ్ నిర్వహించగా ఖమ్మం విజయం సాధించింది. ఈసందర్భంగా విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పాటిబండ్ల రఘునందన్, మిత్ర ఫౌండేషన్ అధినేత కురెవెళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పోచయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి 350 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో స్టేట్ మీట్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజ్‌కుమార్, హెచ్ ట్రిపుల్ ఈ రామక్రిష్ణ, ఏఓ మనోహర్‌రావు, పీఈటీలు వాసుదేవరావు, మనోజ్‌కుమార్, కొండ రవి, వంచ చంద్రశేఖరరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గోపాలకృష్ణ, వేణు, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు

వరంగల్ స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానంలో శని, ఆదివారం జరగనున్న 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పురుషుల జట్టులో రాజీవ్, వెంకటేశ్, రాజు, పవన్‌కళ్యాణ్, రాకేష్, బీష్మ, ప్రసాద్, హరి, రమణ, తరుణ్, రత్నకుమార్.. మహిళల జట్టులో రీతూ, దీక్షిత, ఆశ్రిత, వెన్నెల, మీనాక్షి, బృందా, జోత్స్న, గౌషియా, సంజూష, ఇషిత, శ్రీచందన, తేజస్వీ ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం(ఈ నెల 8న) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికల్లో 19 ఏళ్లలోపు వయసున్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు జేఎన్‌ఎస్‌లో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 14వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.